క్లుప్తంగా

తాటిపర్తి ఉపసర్పంచ్ ఎన్నిక నేడు

పొదలకూరు : మండలంలోని తాటిపర్తి పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నిక గురువారం నిర్వహిస్తామని ఎంపీడీఓ నరసింహారావు బుధవారం తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

2 నుంచి కోదండరాముని విగ్రహ ప్రతిష్ట

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు పంచాయతీ గురవాయపాళెంలో ఏప్రిల్ 2 నుంచి 4వ తేదీ వరకు కోదండరామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరుగుతుందని గ్రామస్తులు బుధవారం వెల్లడించారు. మూడు రోజుల పాటు నిరంతర అన్న ప్రసాదాల వితరణతో పాటు అత్యంత వైభవంగా కోదండరామస్వామి కల్యాణోత్సవం ఉంటుందన్నారు.

పది పరీక్షలకు ఎనిమిది మంది గైర్హాజరు

ముత్తుకూరు : ముత్తుకూరు మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో పది పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్టు ఎంఈఓ మధుసూదన ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 692 మంది విద్యార్థులకు గానూ భౌతిక శాస్త్ర పరీక్షకు 684 మంది హాజరయ్యారని వెల్లడించారు.

ఆక్వాలో నీటి యాజమాన్యం ముఖ్యం



ఆక్వా క్లినిక్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ ఆనందప్రసాద్

ముత్తుకూరు : ఆక్వా పెంపకంలో నీటి యాజమాన్యం చాలా ముఖ్యమని మత్స్యకళాశాల శాస్త్రవేత్త డాక్టర్ ఆనందప్రసాద్ అన్నారు. మండలంలోని మల్లూరులో ఉన్న మత్స్యకళాశాలలో చదివే బీఎఫ్‌ఎస్సీ నాలుగో సంవత్సర విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా బుధవారం రొయ్య రైతుల కోసం ఆక్వా క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. చెరువుల నీటిలో అమ్మోనియా, సెలెనిటీ, ఆక్సిజన్ మోతాదుపై పరీక్షలు జరిపారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి గ్రామస్తులకు మధుమేహం, బీపీ పరీక్షలు జరిపారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ త్రివేణి, శ్రీవిద్య పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి



బీఎల్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్

కొడవలూరు : ప్రతి ఓటరుకు విధిగా ఆధార్ అనుసంధానం చేయాలని తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్వోలతో బుధవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు హక్కు కోసం వచ్చిన దరఖాస్తులను సకాలంలో నమోదు చేయాలన్నారు. ఒక కుటుంబంలోని ఓటర్లంతా ఒకే బూత్ పరిధిలో ఉండేలా చూడాలని చెప్పారు. గతంలో 1,500 మంది ఓటర్లు దాటితే కొత్త పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాల్సి ఉండేదని, కొత్త నిబంధనల ప్రకారం 1,200 మంది ఓటర్లు దాటితే కొత్త పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఏఓ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

నెల్లూరు(క్రైమ్): నగరంలోని కుసుమ దళితవాడ సమీపంలో గల ఓ వైన్ షాపు వద్ద మద్యం మత్తులో ఆరుగురు యువకులు బుధవారం హల్‌చల్ చేశారు. ప్రధాన రహదారిపై వాహన రాకపోకలను అడ్డుకోవడమే కాకుండా స్థానికంగా ఉన్న దుకాణదారులపై వీరంగం చేశారు. దీంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చేసేదేమీ లేక మిన్నకుండిపోయారు. ఇలాంటి ఘటనలు ఇక్కడ నిత్యకృత్యంగా మారాయని చెప్పారు.

మహాధర్నాపై వినతిపత్రం అందజేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తిరుపతిలోని సీఎండీ కార్యాలయం వద్ద ఏప్రిల్ ఏడున నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించిన వినతిపత్రాన్ని ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావుకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహాధర్నాకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. యూనియన్ ప్రధాన కార్యదర్శులు సుమన్, కుమార్, జిల్లా నేతలు మహేష్, సుబ్రమణ్యం, ఆసిఫ్, రాజశేఖర్, సునీల్, విజయ్‌కుమార్, వేణు, మధు, లోకేష్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మాకంటే.. మాకే..!

- నామినేటెడ్ పదవులపై గందరగోళం
- కోవూరు టీడీపీలో కలవరం
- మూడు వర్గాలుగా చీలిన నాయకులు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: సీఎం చంద్రబాబు జిల్లా, మండల కేంద్రాల్లో నామినేటెడ్ పదవులను త్వరలో భర్తీ చేస్తామని ఇటీవల ప్రకటించారు. దీంతో కోవూరు టీడీపీలో కలవరం మొదలైంది. పదవులు తమకంటే తమకే అని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వర్గం, పోలంరెడ్డి దినేష్‌రెడ్డి వర్గం, మొదటి నుంచి టీడీపీని అంటిపెట్టుకుని ఉన్న మరో వర్గం నేతల్లో తీవ్ర చర్చలు జరుగుతున్నాయి. ఇదిలా ఉంటే వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన మరో వర్గం నేతలు ఆ పార్టీకి మరింత తలనొప్పిగా మారారు. పైకి తామంతా ఒకటే అని చెబుతున్నా.. లోలోపల ఎవరికి వారు గ్రూపులుగా ఉంటున్నారు. దీంతో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పదవులు ఎవరికివ్వాలో తేల్చుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. తొలుత ఎమ్మెల్యే జొన్నవాడ కామాక్షితాయి ఆలయ చైర్మన్‌తో పాటు, కోవూరు మార్కెటింగ్ చైర్మన్ పదవులపై స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. కామాక్షితాయి ఆలయ చైర్మన్‌గా పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన తిరుమూరు అశోక్‌రెడ్డిని నియమించనున్నట్లు ఆ పార్టీ నేతలు అంటున్నారు. కోవూరు మార్కెట్ చైర్మన్‌గా విడవలూరు మండలం ఊటుకూరుకు చెందిన టీడీపీ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డి పేరును ఖరారు చేసినట్లు సమాచారం.

కామాక్షితాయి ఆలయంపై కన్ను

నిబంధనల ప్రకారం కామాక్షితాయి ఆలయ కమిటీ సభ్యులు రెండు సంవత్సరాలు పదవిలో ఉంటారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే టీడీపీ నేతలు ఆలయంపై పెత్తనం చెలాయిస్తున్నారు. కొత్తగా ఆలయ కమిటీని నియమించాలంటే న్యాయపరమైన చిక్కులు వస్తాయని భావించిన ప్రశాంతిరెడ్డి చైర్మన్‌గా అశోక్‌రెడ్డి పేరును ఖరారు చేసినా ప్రస్తుతం ఉన్న కమిటీ కాలపరిమితి ముగిసేవరకు వేచిచూడాలని ఆమె భావిస్తున్నారు.

పెరగనున్న విభేదాలు

కోవూరు టీడీపీలో వర్గాలుగా ఉన్న టీడీపీ నాయకులు ఎవరికి వారు పదవులు తమకే వస్తాయని భావిస్తున్నారు. నామినేటెడ్ పదవుల ప్రక్రియ పూర్తయితే అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే కొంతమంది టీడీపీ నేతలు ఎమ్మెల్యే ఓ వర్గాన్ని మాత్రమే పెంచి పోషిస్తోందని, తమను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మండల ఇన్‌చార్జులుగా వారినే నియమించుకున్నారని అంటున్నారు. ఈ విషయంలో ఇప్పటికే పార్టీ అధిష్టానానికి కొందరు నాయకులు ఎమ్మెల్యేపై ఫిర్యాదులు పంపారు. ఇంత గందరగోళ పరిస్థితుల్లో నామినేటెడ్ పదవులు ఎవరిని వరిస్తాయో వేచిచూడాలి.

దళితులకు అన్యాయం చేస్తూ..

కోవూరు ఏఎంసీ(వ్యవసాయ మార్కెట్ కమిటీ) చైర్మన్ పదవి నియామకం ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. దీనికి బెజవాడ వంశీకృష్ణారెడ్డిని నియమించేందుకు అధికార పార్టీ నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. నిజానికి 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్టీ మహిళకు కోవూరు ఏఎంసీ చైర్మన్ పదవిని కేటాయించారు. దీనిని అప్పటి ఎమ్మెల్యే ప్రసన్న ఆనందంగా స్వీకరించారు. అంతేకాకుండా ఐదేళ్ల తరువాత జరిగే రిజర్వేషన్‌ల కేటాయింపులో కోవూరు ఏఎంసీని ఎస్సీకి కేటాయించాలని ప్రసన్న అప్పటి వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి లేఖ రాశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేస్తూ దీనిని ఓపెన్ కేటగిరీగా మార్చి వంశీకృష్ణారెడ్డికి కట్టబెట్టేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది.

4న ఆరోగ్య శాఖ మంత్రి రాక

పొదలకూరు : ఏప్రిల్ 4వ తేదీ మధ్యాహ్నం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పొదలకూరు సీహెచ్‌సీకి రానున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యు.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీహెచ్‌సీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను మంత్రితో పాటు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభిస్తారన్నారు.

మైనారిటీ సెల్ సంయుక్త కార్యదర్శిగా అహ్మాద్



కోవూరు : వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోవూరు మండలం పడుగుపాడు ఉపసర్పంచ్ షేక్.అహ్మాద్‌ను పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా అహ్మాద్ బుధవారం మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని, మైనారిటీల హక్కుల కోసం పోరాడుతానని తెలిపారు. అనంతరం నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పంట నమోదు చేసుకోవాలి

- డీఏఓ సత్యవాణి



రైతులకు సూచనలిస్తున్న డీఏఓ సత్యవాణి

కొడవలూరు : పట్టాదారు పాసు పుస్తకాల్లేని రైతుల వివరాలు వెబ్ ల్యాండ్‌లో ఉండవని, అలాంటి రైతులు సంబంధిత పత్రాలు చూపి పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారిణి (డీఏఓ) పి.సత్యవాణి సూచించారు. మండలంలోని కొత్త వంగల్లులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా జరిగిన అవగాహన కార్యక్రమానికి బుధవారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కొందరు రైతులు పట్టాదారు పాసు పుస్తకాల్లేనందున పంట నమోదుకు నోచుకోలేకపోయామని డీఏఓ దృష్టికి తెచ్చారు. ఆమె సమాధానమిస్తూ పట్టాదారు పాసు పుస్తకాల్లేని రైతుల వివరాలు వెబ్ ల్యాండ్‌లో ఉండవని, అలాంటి వారు ఫలానా భూమిలో తాము సాగు చేస్తున్నామని వీఏఏలకు తెలుపడం ద్వారా పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. అదేవిధంగా విశిష్ట సంఖ్య కూడా పొందాలన్నారు. రైతులకు పంట నమోదు చేసుకోవడం, విశిష్ట సంఖ్య పొందడం అవశ్యమన్నారు. లేనిపక్షంలో అలాంటి వారికి ప్రభుత్వపరంగా రైతులుగా గుర్తింపు ఉండదన్నారు. ప్రభుత్వ పథకాలకు దూరమవుతారని స్పష్టం చేశారు. సమావేశంలో ఏడీఏ నర్సోజి, ఏఓ లక్ష్మి, ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏలు జి.ఉమామహేష్, సీహెచ్.వంశీకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థినులకు వీఎస్‌యూ వీసీ అభినందన



ప్రతిభ చూపిన విద్యార్థినిని అభినందిస్తున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం : వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) విద్యార్థినులను వీసీ అల్లం శ్రీనివాసరావు బుధవారం అభినందించారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో భారతీయ భాషా దివస్ సందర్భంగా ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వీఎస్‌యూ విద్యార్థినులు ప్రతిభ చూపారు. ఇందులో పి.ప్రత్యూష (తెలుగు డిపార్ట్‌మెంట్) ప్రథమ బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి షాజిదా బేగం (పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్) రూ.3 వేలు, మూడో బహుమతి పి.జ్యోతి (ఎంబీఏ డిపార్ట్‌మెంట్)– రూ.2 వేలు సాధించారు. దీంతో వీరిని వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత అభినందించారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికను పూర్తి చేయాలి

- నెల్లూరు డీఎల్‌పీఓ రమణయ్య



జీపీడీపీ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రమణయ్య

పొదలకూరు : 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీలకు కేటాయించాలంటే గ్రామాభివృద్ధి ప్రణాళికను పూర్తి చేయాలని నెల్లూరు డీఎల్‌పీఓ పి.రమణయ్య పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జీపీడీపీ అప్‌లోడ్ ప్రక్రియను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు అందజేయాలంటే విధిగా ప్రణాళికను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. కనుక ఆయా పంచాయతీల సెక్రటరీలు గ్రామ స్వరాజ్ పోర్టల్‌లో జీడీడీపీ ప్లాన్‌ను అప్‌లోడ్ చేయాల్సిందిగా సూచించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాల్సిందిగా సెక్రటరీలను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ డీవీ నరసింహారావు తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులను పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

తోటపల్లిగూడూరు : మండలంలోని మాచర్ల వారిపాళెంలో ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ(పవర్‌ప్లాంట్) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంపెనీ సీఎస్సార్ నిధులతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో స్థానిక గ్రామాలకు చెందిన 163 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మాదాల రూపేష్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సుహేల్ బాషా, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



ఇందుకూరుపేట : మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ గంగాభవాని మాట్లాడుతూ ఇందుకూరుపేటలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా 1,992 పనులకు గానూ రూ.8.30 కోట్ల నిధులను ఖర్చు చేసినట్టు తెలిపారు. మొత్తం పనులకు సంబంధించి రూ.29,864లను రికవరీ చేసినట్లు వివరించారు. అంబుడ్స్‌మెన్ హసన్ వెంకటరెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఏపీడీ మృధుల, ఎంపీడీఓ నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవం

నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో తాళ్లపాక అన్నమాచార్యులు ఆరాధన మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి జ్యోతి ప్రజ్వలన చేశారు. అన్నమాచార్యులు సంకీర్తనలను ఆలపించారు.

సముద్రంపై పరిశోధనలు పెరగాలి



మాట్లాడుతున్న వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు

వెంకటాచలం : సముద్రంపై పరిశోధనలు మరింత పెరగాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో బ్లూ రెవల్యూషన్ ఇన్నోవేషన్స్ ఇన్ మెరైన్ సిస్టమ్స్ (బీఆర్‌ఐఎంఎస్–2025) అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు బుధవారంతో ముగిసింది. ముగింపు సదస్సులో వీసీతో పాటు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత పాల్గొని, మాట్లాడారు. సముద్ర ఆవిష్కరణలపై పరిశోధనల వల్ల భవిష్యత్ తరాలకు మెరుగైన వనరులు అందుబాటులోకి వస్తాయని తెలియజేశారు. సముద్ర జీవన వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ ఆవిష్కరణలపై మరింత శ్రద్ధ పెట్టాల్సి ఉందని సూచించారు. సదస్సులో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌సీలను ప్రభుత్వమే ఇవ్వాలి



వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం : వాహనదారులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ప్రభుత్వమే ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేటు వారికి ఇవ్వవద్దని బుధవారం వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఇవి ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వస్తాయన్నారు. దీనివల్ల జిల్లాలో ఉన్న అన్ని ప్రాంతాల వాహనదారులు ముత్తుకూరు దగ్గర ఉన్న కప్పలదొరువులో ఏర్పాటు చేసిన సెన్సార్ ట్రాకింగ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, దీంతో సుదూర ప్రాంతం నుంచి వచ్చేవారికి ఇబ్బందులు ఉంటాయని తెలిపారు. అంతేకాకుండా ట్రాకింగ్ సిస్టమ్‌తో అనేక సమస్యలు ఉంటాయన్నారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్.జాని బాషా, ఆటో యూనియన్ నాయకులు రాధయ్య, మల్లికార్జున, రమేష్, నాగరాజు, ఖాజా రసూల్ పాల్గొన్నారు.

కొలనకుదురు గొంతెండుతోంది



అప్పుడప్పుడు వచ్చే ట్యాంకర్

మనుబోలు : మండలంలోని తీరప్రాంత గ్రామమైన కొలనకుదురులో గత వారం రోజులుగా తాగునీటికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కుళాయిల ద్వారా వారం రోజులుగా తాగునీరు సరిపడా రావడం లేదని గ్రామస్తులు తెలిపారు. తాము తాగునీటికి ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ కార్యదర్శి స్పందించడం లేదని వాపోయారు. కొలనకుదురు సముద్రానికి దగ్గరగా ఉండడంతో ఇక్కడ భూగర్భ జలాలు ఉప్పగా ఉంటాయి. దీంతో మనుబోలు పంచాయతీ పరిధిలోని యాచవరం వద్ద బోరు వేసి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా తీరప్రాంత గ్రామాలైన కొలనకుదురు, కట్టువపల్లి గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తారు. అయితే పంచాయతీ సిబ్బందికి సక్రమంగా జీతాలు ఇవ్వకపోవడంతో నీటి సరఫరా గురించి పట్టించుకోవడం లేదు. తాత్కాలికంగా గ్రామానికి చెందిన అల్లాబాషా అనే వ్యక్తి ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ సమస్యను స్థానిక అధికార పార్టీ నాయకులు సునీల్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డిలు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వం మారింది.. నివేదికలూ మారాయి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పార్టీ శ్రేణులను పలకరిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (పొగతోట): ప్రభుత్వం మారాక.. నివేదికలూ మారిపోయాయని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయానికి వేలాదిగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి బుధవారం ఆయన మాట్లాడారు. 2023, డిసెంబర్‌లో అప్పటి జిల్లా మైనింగ్ అధికారితో పాటు వివిధ విభాగాలకు చెందిన వారు వెళ్లి అక్రమ మైనింగ్ జరగలేదని, 1050 మెట్రిక్ టన్నుల క్వార్ట్జ్, పల్స్‌ఫర్, మైకా ఖనిజ గుట్టలను గుర్తించామని నివేదిక ఇచ్చిన అంశాన్ని గుర్తుచేశారు. అయితే నూతన ప్రభుత్వం కొలువుదీరాక ఇవి మారిపోయాయని ధ్వజమెత్తారు. అక్రమ మైనింగ్ జరగలేదని నివేదిక ఇచ్చిన జిల్లా మైనింగ్ అధికారి.. ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో దీనిపై విచారణ జరపాలని పొదలకూరు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారని చెప్పారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలు, మద్దతుదారులను ఒక్కొక్కరిగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. తనకు సంబంధం లేకపోయినా, ముద్దాయిగా అక్రమంగా ఇరికించారని ఆరోపించారు. పోలీసులు ఎన్ని తప్పుడు కేసులు బనాయించినా, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామే తప్ప బెదిరేదిలేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో జగనన్నే తన ధైర్యం.. ప్రజలు, నేతలు, కార్యకర్తలే ఆస్తి అని చెప్పారు. తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలను జీవితంలో మరువలేనన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఫోన్లు చేసి ధైర్యాన్నిస్తున్న నేతలు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలను తెలియజేశారు.